అటకెక్కిన గ్రామ పంచాయతీ పాలన

- గంగూరులో కార్యదర్శుల మూడు ముక్కలాట
- వివాదాలకు కేరాఫ్ కార్యదర్శులు
- ప్రజలకు అందుబాటులో లేని పాలన
- ఇబ్బందులు పడుతున్న ప్రజానీకం



గంగూరు గ్రామ పంచాయతీ కార్యాలయం

పెనమలూరు: గంగూరు గ్రామ పంచాయతీ పాలన అటకెక్కింది. గ్రామ పంచాయతీలో కార్యదర్శుల వ్యవహారం వివాదంగా మారటంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ పంచాయతీ కార్యదర్శులు నిలకడగా లేకపోవటంతో పాలన అగమ్య గోచరంగా మారింది. నేటికీ అధికారులు చర్యలు తీసుకోకపోవటంతో ప్రజలకు శాపంగా ఉంది.

డెప్యూటేషన్‌పై బదిలీలు..

గతంలో గంగూరు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా సుబ్బారావు ఉండే వారు. ఆయనకు ఉయ్యూరు మండలం చిన ఓగిరాలకు బదిలీ కావటంతో ఆయన స్థానంలో మూడు నెలల క్రితం వెంకటేశ్వరరావు బాధ్యతలు చేపట్టారు. అయితే పాలన పరంగా పలు లుకలుకలు ఉండటంతో పాలకులకు, కార్యదర్శి వెంకటేశ్వరరావుకు మధ్య వివాదం మొదలైంది. బాధ్యతలు తీసుకున్న కార్యదర్శి వెంకటేశ్వరరావుపై గ్రామ పంచాయతీ పాలకులు నియోజకవర్గ నేతలకు ఫిర్యాదు చేశారు. దీంతో నేత కార్యాలయంలో పంచాయతీ జరిగింది. వీరి మధ్య రగడ ముదరటంతో నియోజకవర్గ నేత డీపీవోతో మాట్లాడి, వెంటనే పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావును తోట్లవల్లూరు మండలం గరికపర్రుకు డెప్యూటేషన్‌పై బదిలీ చేశారు. ఆయన స్థానంలో నాగాయలంక పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్‌ను తీసుకు వచ్చి గంగూరు కార్యదర్శిగా డెప్యూటేషన్ బాధ్యతలు అప్పగించారు. అయితే కార్యదర్శి వెంకటేశ్వరరావు వెళ్తూ తన వద్ద ఉన్న రికార్డులను తిరిగి పూర్వ కార్యదర్శి సుబ్బారావు కు అప్పగించారు. కొత్తగా వచ్చిన పవన్‌కుమార్‌కు రికార్డులు తిరిగి సుబ్బారావు చార్జ్ అప్పగించలేదు. పవన్‌కుమార్ వచ్చి నెల రోజులు గడుస్తున్నా పూర్తి చార్జ్ లేకపోవటంతో గ్రామ పంచాయతీ పాలన అటకెక్కింది.

చార్జ్ తీసుకోని పరిస్థితి..

కాగా గంగూరు గ్రామ పంచాయతీలో పాలన గ్రామ ప్రజలకు అందుబాటులో లేకుండా పోయింది. కొత్తగా వచ్చిన కార్యదర్శి పవన్ చార్జ్ తీసుకోకపోవటం, ఆయన కూడా అడపా దడపా విధులకు రావటం, తరుచుగా సెలవులు పెట్టడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. చార్జ్ అప్పగించే విషయంలో అధికారులు చర్యలు తీసుకోలేదని ఆరోపణలు ఉన్నాయి. పైగా ఇప్పుడు ఉన్న కార్యదర్శి సైతం బదిలీపై వెళ్లి పోతారని ప్రచారం జరుగుతుంది. గంగూరుకు పంచాయతీ కార్యదర్శి ఎవరైనా రావాలంటే వెనుకడుగు వేస్తున్నారని గుసగుసలు వినబడుతున్నాయి. పంచాయతీ గుమస్తా కూడా సెలవులో ఉండటంతో పరిస్థితి గందరగోళంగా మారింది. వీధి దీపాలు వెలగక పోవటం, పారిశుధ్యం క్షీణించటం, తాగు నీరు ఇలా అనేక సమస్యలు ఉన్నాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు పంచాయతీ కార్యదర్శిని కలవటానికి గ్రామస్తులు వస్తే ఖాళీ కుర్చీ దర్శన మిస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులు తమ గోడు చెప్పుకోవటానికి అధికారులు ఎవరూ అందుబాటులో ఉండటం లేదు. గ్రామ పంచాయతీ పాలనను గాడిలో పెట్టాల్సిన మండల అధికారులు సైతం పట్టించుకోవటం లేదని గ్రామస్తులు తెలుపుతున్నారు.

చర్యలు తీసుకుంటా..

గంగూరు గ్రామ పంచాయతీలో పాలన సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటా. కొత్తగా వచ్చిన కార్యదర్శికి చార్జ్ అప్పగించే విధంగా ఆదేశిస్తా.

– బండి ప్రణవి, ఎంపీడీఓ, పెనమలూరు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరంరూరల్: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం గన్నవరం సెక్షన్ పరిధిలో వీరపనేని గూడెం సబ్ స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గుణదల ఏపీసీపీడీసీఎల్ ఈఈ పి.హరిబాబు బుధవారం తెలిపారు. దీంతో శేష సాయి గార్డెన్, ఐటీఐ కాలేజ్ రోడ్డు, బీబీగూడెం, వీరపనేనిగూడెం, తెంపల్లి, బల్లిపర్రు, మెట్లపల్లి, కంఢ్రిక, కొత్తగూడెం, చిక్కవరం, చింతగుంట, గొల్లనపల్లి, స్టేట్ స్కూల్ తదితర ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

నేడు, రేపు ఉంగుటూరులో కోతలు

గన్నవరంరూరల్: ఉంగుటూరు మండలంలోని పలు గ్రామాల్లో గురు, శుక్ర వారాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు గుడివాడ ఈఈ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురు, శుక్రవారాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొత్త విద్యుత్ లైన్ల ఏర్పాటు చేస్తున్నందున విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు. ఉంగుటూరు, ఆముదాలపల్లి, కొయ్యగూరపాడు, గారపాడు, పొనుకుమాడు, ఎలుకపాడు, నాగవరప్పాడు, తుట్టగుంటపాడు, వెన్నూతల, వెల్దిపాడు, తరిగొప్పల, వేంపాడు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

క్లుప్తంగా

సినిమా హాల్‌ను తనిఖీ చేసిన అధికారులు



గన్నవరంరూరల్: పట్టణంలోని శాంతి థియేటర్‌ను తహసీల్దార్ కేవీ శివయ్య బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సినిమా హాల్‌ను నడిపే విషయంపై నియమావళి పరిశీలన చేశారు. ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించటంపై సమగ్రంగా తనిఖీ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేవని వాటిపై తగిన సూచనలు చేశామన్నారు. సినిమా థియేటర్‌లో సమస్యలపై ప్రేక్షకులు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని కోరారు. డెప్యూటీ తహసీల్దార్ భవాని, ఆర్ఐ రవి, జూనియర్ అసిస్టెంట్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వెండి కుంభ హారతి వితరణ



గన్నవరంరూరల్: స్థానిక వాసవీ కన్యక పరమేశ్వరీ ప్రార్థన మందిరంలో అమ్మవారికి బుధవారం 235 గ్రాముల వెండి కుంభ హారతిని పట్టణానికి చెందిన పబ్బతి సత్యనారాయణ, వారి కుమారులు వితరణగా అందజేశారు. అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలని ఆ కుటుంబం వేదపండితులచే ప్రత్యేక పూజలు చేశారు. సత్యనారాయణ మనుమరాలు రిషిత శ్రీ సంజన పుట్టిన రోజు సందర్భంగా వితరణ చేశారు. మందిర అధ్యక్షుడు కందగడ్డల కృష్ణారావు, కోశాధికారి మదుపల్లి బాలకృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు కూర్మాల సత్య శ్రీనివాస్‌కుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

31న మండల పరిషత్ సమావేశం

కంకిపాడు: కంకిపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 31వ తేదీన శనివారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.అనూష తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి, పెండింగ్ పనులపై సమావేశంలో చర్చిస్తామన్నారు. మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి



పెనమలూరు/కంకిపాడు/రామవరప్పాడు: పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల వ్యాప్తంగా మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలతో పాటు గ్రామాల్లో ఎన్టీఆర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ సేవలను అధికారులు, నాయకులు స్మరించుకున్నారు. కార్యక్రమంలో సీఐ వెంకటరమణ, ఎస్ఐ ఉషారాణి, రైటర్ రామ్‌ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు. కంకిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో దాతలు రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

భూగర్భ డ్రెయినేజీ సమస్యలపై చర్యలు



పటమట(విజయవాడతూర్పు): భూగర్భ డ్రెయినేజీ సమస్యలు పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. బాలాజీ నగర్, సిమెంట్ గోడౌన్, కృష్ణలంక ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. కృష్ణలంక బాలాజీ నగర్‌లో భూగర్భ డ్రెయినేజీ పొంగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వచ్చిన ఫిర్యాదుపై స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. త్వరితగతిన పనులను పూర్తి చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా భూగర్భ డ్రెయినేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సిమెంట్ గోడౌన్ వద్ద అమృత్ 2.0 పథకం ద్వారా రూ.2.8 కోట్ల నిధులతో నిర్మిస్తున్న రిజర్వాయర్ పనులు పరిశీలించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సామ్రాజ్యం, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మతం పేరిట చిచ్చు పెట్టే విధానాలు తగవు



జంక్షన్‌లో ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: రాజకీయ అవకాశాల కోసం ప్రజల మధ్య మతం పేరిట చీలికలు తెచ్చే విధానాలను వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు అన్నారు. సీపీఎం, ముస్లిం మైనార్టీ సంఘాల ఆధ్వర్యంలో హనుమాన్‌జంక్షన్‌లో బుధవారం 'సమైక్యతా యాత్ర' నిర్వహించారు. స్థానిక నూజివీడు రోడ్డులోని సీఐటీయూ కార్యాలయం నుంచి ప్రధాన కూడలి మీదగా విజయవాడరోడ్డులోని ఆర్టీసీ బస్టాండ్ వరకు ప్రదర్శన సాగింది. ఉగ్రవాదం, మతోన్మాదం, యుద్ధోన్మాదం నశించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దేశ సమైక్యత, లౌకికవాదం వర్ధిలాలి అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ ఉగ్రదాడులను అడ్డుపెట్టుకుని ఓ వర్గాన్ని రెచ్చగొడుతూ మరో వర్గంపై దాడులను బీజేపీ, ఆర్ఎస్ఎస్ ప్రోత్సహిస్తున్నాయన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కల్లం వెంకటేశ్వరరావు, మాదాల వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి బేతా శ్రీనివాసరావు, మండల మాజీ కార్యదర్శి అబ్దుల్ బారీ, ముస్లిం మైనార్టీ సంఘాల నాయకులు షేక్ అబ్దుల్లా, షేక్ నజీర్, షేక్ మీరా, షేక్ గౌస్ బాషా పాల్గొన్నారు.

యువత దేశ రక్షణలో భాగస్వాములు కావాలి


సీడీ ఆవిష్కరిస్తున్న మల్లికార్జునరావు, దాస్, హజరత్తయ్యగుప్తా, జగన్నాథరావు, తపస్వి

విజయవాడకల్చరల్: యువత దేశ రక్షణలో భాగస్వాములు కావాలని తపస్వి కల్చరల్ ఆర్ట్స్ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. ఏపీ సృజనాత్మక సమితి, తపస్వి కల్చరల్ ఆర్ట్స్, ఆంధ్రనాటక కళాసమితి ఆధ్వర్యంలో దుర్గాపురంలోని జీవీఆర్ సంగీత కళాశాలలో కార్యక్రమం నిర్వహించారు. యుద్ధంలో వీరమరణం పొందిన భారత జవాన్లకు ఘననివాళి, ఓ త్యాగమయిలారా సీడీ ఆవిష్కరణ, ఎన్టీఆర్ జయంతి నిర్వహించారు. గుప్తా మాట్లాడుతూ దేశరక్షణ కోసం అనుక్షణం తపిస్తూ జీవితాలను త్యాగం చేస్తున్న సైనికులు సదా స్మరణీయులని కొనియాడారు.

కళాకారుల అభివృద్ధికి కృషి..

సీడీని ఆవిష్కరించిన ఏపీ సృజనాత్మక సమితి సీఈవో ఆర్.మల్లికార్జునరావు మాట్లాడుతూ తెలుగు జాతి గర్వించదగిన నటుడు నందమూరి తారక రామారావు అని అభివర్ణించారు. సాంస్కృతిక శాఖ ద్వారా కళాకారుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యావేత్త ఎంసీదాస్ మాట్లాడుతూ భారతదేశ సైనిక శక్తికి ప్రపంచమే పాదాక్రాంతమైందన్నారు. తపస్వి కల్చరల్ ఆర్ట్స్ కార్యదర్శి సూర్యదేవర జగన్నాథరావు సంస్థ లక్ష్యాలను వివరించారు. కార్యక్రమంలో వేమూరి నాగేశ్వరశర్మ, కుమార సూర్యనారాయణ, గాయని సుధా శ్రీనివాస్, తపస్వి పాల్గొన్నారు. హేమంత్‌కుమార్ బృందం దేశ భక్తి గీతాలకు నృత్యాలను అభినయించింది. వీర్ల ప్రసాద్ రచించి, వెనిగళ్ల భాస్కర్ దర్శకత్వం వహించిన వామ్మో గుత్తి వంకాయ్ హాస్యనాటికను ప్రదర్శించారు.

విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలి


వణుకూరులో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు


పురుషోత్తపట్నంలో ఆటలు ఆడుతున్న చిన్నారులు

పెనమలూరు: విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని వణుకూరు గ్రంథాలయ అధికారి భారతి అన్నారు. వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం గ్రంథాలయంలో విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. పుస్తక పఠనం విద్యార్థులు అలవాటు చేసుకోవటం వలన చదువుపై శ్రద్ధ పెరుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులతో తోక కథలు, నీతి పద్యాలు చెప్పించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. పెనమలూరు శాఖ గ్రంథాలయంలో రాష్ట్ర మాజీ సీఎం ఎన్టీఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి హరీషా, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో మేథో వికాసం

గన్నవరంరూరల్: పుస్తకాలు చదవటం విద్యార్థులకు ఎంతో మేలు చేస్తోందని పురుషోత్తపట్నం శాఖ గ్రంథాలయాధికారి కె.కృపానందం పేర్కొన్నారు. సమ్మర్ క్యాంపులో భాగంగా బుధవారం విద్యార్థులకు పుస్తకాలు చదవటం, చెస్, క్యారమ్స్, లూడో వంటి పోటీలు నిర్వహించి విజేతలను అభినందించారు. పాఠకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ముస్తాబాద శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కె.జ్యోతికుమారి ఆధ్వర్యంలో విద్యార్థులకు రీడింగ్ పోటీలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ నిరంతరం పుస్తకాలు చదవాలని చెప్పారు. పాఠకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

చదువుతో పాటు ఆట పాటలూ ముఖ్యమే

కంకిపాడు: చదువుతో పాటు ఆట పాటలూ ముఖ్యమేనని వక్తలు పేర్కొన్నారు. వేసవి శిక్షణ శిబిరాలు మండలంలో ఉత్సాహంగా సాగుతున్నాయి. కంకిపాడు శాఖా గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు పుస్తక పఠనంలో పోటీలు నిర్వహించారు. ఆటల పోటీలు నిర్వహించి ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమాన్ని గ్రంథాయాధికారి సీహెచ్ రామకృష్ణ, ఉపాధ్యాయుడు ఎం.మల్లేశ్వరరావు, టి.శేషుబాబు పర్యవేక్షించారు. తెన్నేరు గ్రంథాలయంలో దుర్గామల్లేశ్వరరావు విద్యార్థులకు చిత్రలేఖనంలో శిక్షణ ఇచ్చారు. డి.లక్ష్మీ కుట్లు, అల్లికల్లో మెలకువలు నేర్పించారు. క్యారమ్స్, చెస్ పోటీల్లో నిర్వహించి ప్రతిభావంతులను అభినందించారు. కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి ఎస్.సునీత పర్యవేక్షించారు.

క్రాఫ్ట్, ఆర్ట్స్‌లో విద్యార్థులకు శిక్షణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని గ్రంథాలయంలో చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరం తరగతులు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఈ శిబిరంలో బుధవారం విద్యార్థులకు క్రాఫ్ట్ ఆర్ట్స్ తరగతులు నిర్వహించారు. విద్యార్థులకు కాగితాలు, కొబ్బరి ఈనెలతో రకరకాల ఆకృతులు తయారు చేయటాన్ని నేర్పించారు. అనంతరం కథల పుస్తకాలను విద్యార్థులతో చదివించారు. పుస్తక పఠనం ద్వారా విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు పెంపొందుతాయని గ్రంథాలయ అధికారి పి.స్వర్ణలతాదేవి చెప్పారు. తొలుత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పంచాయతీ కార్యదర్శి బి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.


ముస్తాబాదలో బుక్ రీడింగ్


కంకిపాడు గ్రంథాలయంలో..


తెన్నేరులో చిత్రలేఖనంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


కంకిపాడులో యోగాసనాలు వేస్తున్న ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు


జంక్షన్‌లో యోగాసనాలు చేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

కంకిపాడు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వక్తలు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా కంకిపాడు మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం యోగా కార్యక్రమం నిర్వహించారు. మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ ఉద్యోగులు, వెలుగు సిబ్బంది, సచివాలయ సిబ్బంది యోగాసనాలు వేశారు. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, ఎంపీపీ పి.అనూష మాట్లాడుతూ.. యోగాతో ఆరోగ్యం వృద్ధి చెందుతుందన్నారు. క్రమశిక్షణ, ఏకాగ్రత అలవడతాయని చెప్పారు. తహసీల్దార్ వి.భావనారాయణ మాట్లాడుతూ.. క్రమం తప్పకుండా యోగా సాధన చేయటం ద్వారా ఆరోగ్యానికి మేలు చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో కార్యాలయ ఏఓ బనవయ్య, యోగా శిక్షకులు వీరంకి రమేష్, మిరియాల సాయికుమార్, కన్యాకుమారి తదితరులు పాల్గొన్నారు.

యోగా, ధ్యానం ప్రాచీన భారతీయ వారసత్వ సంపద

హనుమాన్‌జంక్షన్‌రూరల్: యోగా, ధ్యానం ప్రక్రియలు ప్రాచీన భారతీయ వారసత్వ సంపద అని బాపులపాడు ఎంపీడీవో కె.జోగేశ్వరరావు అన్నారు. స్థానిక విజయవాడరోడ్డులోని లయన్స్‌క్లబ్ హాల్‌లో యోగాంధ్ర-2025 మాస్టర్స్ ట్రైనర్స్ ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం రెండో రోజైన బుధవారం జరిగింది. మండలంలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లకు యోగా శిక్షణ నిర్వహించారు. ఎంపీడీవో జోగేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచానికి భారత్ అందించిన గొప్పవరం యోగా, ధ్యాన్య ప్రక్రియలన్నారు. ఇవి భారతీయ సంస్కృతి, జీవన విధానంలో అంతర్భాగమని చెప్పారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు విజయవంతం చేయాలని కోరారు.

'ఆచంట' నటన అజరామరం

భవానీపురం(విజయవాడపశ్చిమ): తెలుగు వారికి మాత్రమే సొంతమైన పద్య నాటకాల్లో విశేష ప్రతిభాపాటవాలను ప్రదర్శించి రంగస్థల రారాజుగా కీర్తిప్రతిష్టలు గడించిన ఆచంట వెంకట రత్నం నాయుడి నటన అజరామరమని పలువురు కళాకారులు, కళాసంస్థల నిర్వాహకులు కొనియాడారు. ఆచంట జయంతిని పురస్కరించుకుని తుమ్మలపల్లి కళాక్షేత్రం ప్రాంగణంలోని ఆయన కాంస్య విగ్రహం వద్ద బుధవారం ఘన నివాళులర్పించారు. ఏపీ నటీనట, నాట్య వృత్తి కళాకారులు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ.. రంగస్థల రారాజుగా విరాజిల్లి తనదైన ప్రత్యేక శైలితో నటించి ప్రేక్షకుల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న మహానటుడు ఆచంట అన్నారు. అటువంటి మహోన్నత నటుడు ఉమ్మడి కృష్ణాజిల్లాలో జన్మించడం జిల్లావాసులకు గర్వకారణమన్నారు. ఆయన తనయుడు ఆచంట బాలాజీ నాయుడు తండ్రి నటనా వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని గొప్ప పౌరాణిక నటుడిగా ఎదగటం అభినందనీయమని పేర్కొన్నారు.

ఆచంట చిరస్మరణీయుడు..

పౌరాణిక నటుడు నరాలశెట్టి రవికుమార్ మాట్లాడుతూ.. ఆచంట సమక్షంలో సత్యహరిశ్చంద్ర నాటకాన్ని ప్రదర్శించి ఆయన ప్రశంసలు అందుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. కంది గంగాధరరావు మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా ఆచంటతో ఉన్న తన అనుబంధాన్ని గుర్తు చేశారు. కళాపోషకులు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ దుర్యోధన ఏకపాత్రాభినయంతో గుర్తింపు పొందిన అనంతరం పద్యనాటక రంగంలో వైవిధ్యమైన పాత్రలు పోషించి నటనలో తన ప్రత్యేకతను చాటుకున్న ఆచంట చిరస్మరణీయుడన్నారు. ఆచంట బాలాజీ నాయుడు మాట్లాడుతూ తండ్రి వెంకటరత్నం నాయుడి నటనా వారసత్వాన్ని అందిపుచ్చుకుని రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల్లో అనేక పౌరాణిక నాటకాలను ప్రదర్శించి ఆయన పేరును నిలబెట్టగలిగినందుకు గర్వంగా ఉందన్నారు. ఆచంటకు నివాళులర్పించిన వారిలో ఏపీ కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ అడపా శేషు, శారదా కళా సమితి వ్యవస్థాపకుడు డోగిపర్తి శంకరరావు, సాహితీవేత్త వెన్నా వల్లభరావు, చివుకుల హరగోపాల్, కళామంజరి వ్యవస్థాపకులు పీవీఎల్ నృసింహం, అల్లూరి మార్కేండేయ రాజు, కొతవరపు గణేష్ కుమార్, చింతా వెంకటేశ్వర్లు, బొజ్జా గౌరీశంకర్ తదితరులు ఉన్నారు.

నిరంతర సాధన ప్రగతికి సోపానం


విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న నిర్వాహకులు

విజయవాడకల్చరల్: నిరంతరం సాధన ప్రగతికి సోపానమని సంస్కారభారతి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పీవీఎస్ కృష్ణ అన్నారు. సంస్కారభారతి విజయవాడ మహానగర్ ఆధ్వర్యంలో 10 రోజులుగా అయోధ్యనగర్‌లోని సంస్థ కార్యాలయంలో నిర్వహిస్తున్న సంగీత శిక్షణా శిబిరం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగీత సాధన వల్ల ఏకాగ్రత అలవాటు అవుతుందని చెప్పారు. గాత్రంతో వాక్ స్పష్టత వస్తుందని తెలిపారు. భాషలో ఉచ్ఛరణ దోషాలు పోతాయని పేర్కొన్నారు. శిబిరంలో భగవద్గీత, లలిత, శాస్త్రీయ సంగీతంలో శిక్షణ ఇచ్చామన్నారు. సంగీత శిక్షకురాలు కె.నాగలక్ష్మి మాట్లాడుతూ శాస్త్రీయ సంగీత విలువలను కాపాడుకోవాలని సూచించారు. సంస్కారభారతి నగర అధ్యక్షుడు భాస్కరశర్మ, దుర్గా శ్రీనివాస్, అల్లు రాంబాబు, ఎం.జ్యోతి, సాయి శంకర్, శివకుమార్ పాల్గొన్నారు. శిక్షణలో పాల్గొన్న చిన్నారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

సృజనాత్మకత విద్యార్థి భవితకు వెలుగుబాట

విజయవాడకల్చరల్: సృజనాత్మకత విద్యార్థి భవితకు వెలుగుబాట అని సాహితీవేత్త స్వర్ణ వెంకటనారాయణ అన్నారు. గ్రంథాలయ పునర్వికాస వేదిక, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ, స్వేచ్ఛ ఆంధ్ర ఆధ్వర్యంలో గవర్నర్‌పేటలోని బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో బాల బాలికల కోసం బుధవారం నిర్వహించిన శిక్షణ శిబిరానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకం మన ఆత్మీయ నేస్తమని చెప్పారు. పునర్వికాసవేదిక నిర్వహిస్తున్న శిక్షణా శిబిరంలో ప్రతిభకు పట్టం కడుతూ బాల బాలికల ప్రతిభకు మెరుగులు దిద్దుతున్నట్లు తెలిపారు. శిక్షణలో భాగంగా నిర్వాహకులు వేదగణితం, బొమ్మలు గీయడం ఎలా, చిత్రలేఖనంలోని ఆధునిక పద్ధతులు అంశంగా అవగాహన కలిగించారు. గ్రంథాలయ పునర్వికాసవేదిక నిర్వాహకులు గోళ్ల నారాయణరావు, సింగంపల్లి అశోక్‌కుమార్, క్లాసిక్ పబ్లికేషన్స్ రాము, కె.శ్రీనివాస్, శోభన్ తదితరులు పాల్గొన్నారు. బాల బాలికలకు విజ్ఞానదాయక పుస్తకాలు పంపిణీ చేశారు.